సాక్షి
శ్రీకాకుళం
బుధవారం | 26 | జూలై | 2023



కర్తవ్య దీక్ష అచం'చలం'

కార్గిల్ కథలు ఎన్ని విన్నా తనివి తీరవు. ఇవిగో ఇద్దరు వీరుల యుద్ధగాథలు ఇక్కడ ఉన్నాయి. - 8లో



పడవ బోల్తా పడి..

సముద్రంలో పడవ బోల్తా పడి ఓ మత్స్యకారుడు మృతి చెందాడు. ఇన్కలపాలెంలో ఘటన జరిగింది. - 8లో

డిగ్రీ ఆరో సెమిస్టర్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ కళాశాలల ఆరో సెమిస్టర్ జవాబు పత్రాల మూల్యాంకనం మంగళవారం ప్రారంభించారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నరసన్నపేట, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, శ్రీకాకుళం రూరల్ గాయత్రి, రాజాం జీసీఎస్ఆర్‌ల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆగస్టు నెల రెండో వారంలోపు ఫలితాలు ప్రకటించేలా లక్ష్యం నిర్దేశించారు.

న్యూస్‌రీల్

నేడు వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు పనుల పరిశీలన

కాశీబుగ్గ/శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఉద్దాన ప్రాంతమైన పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాలకు రూ.700 కోట్లతో రక్షిత మంచినీరు అందించనున్న వాటర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం పరిశీలించనున్నారు. హిరమండలం, మెళియాపుట్టి వద్ద జరుగుతున్న పనులను మంత్రితో పాటు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డిశాంతి, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ తదితరులు పరిశీలిస్తారు. ఈ మేరకు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదలైంది.

ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 900 మందికి ప్రవేశాలు



విద్యార్థినికి ప్రవేశ ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో మొదటి విడత కౌన్సెలింగ్ ముగిసింది. 1086 మందికి కాల్ లెటర్స్ పంపించగా, సోమ, మంగళవారాల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 900 మంది హాజరయ్యారు. క్యాంపస్‌లో 1100 సీట్లు ఉండగా, స్పోర్ట్స్, ఎన్‌సీసీ వంటి ప్రత్యేక కేటగిరీల రిజర్వేషన్ మెరిట్ లిస్టు సిద్ధం కాలేదు. ఈ నేపథ్యంలో 1086 మంది మెరిట్ జాబితా సిద్ధం చేసి, కాల్ లెటర్లు అందజేశారు. రెండు రోజుల్లో మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తిచేయగా, 186 మంది గైర్హాజరయ్యారు. ప్రస్తుతం శ్రీకాకుళం క్యాంపస్‌లో 200 సీట్లు మిగిలాయి. త్వరలో మెరిట్ జాబితా ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. 1100 మందికి ఆగస్టు మొదటి వారం నాటికి ప్రవేశాలు కల్పించి, రెండో వారంలో క్లాస్‌వర్క్ ప్రారంభిస్తారు. కౌన్సెలింగ్‌ను డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు పర్యవేక్షించారు. 30 ధ్రువీకరణ పత్రాల పరిశీలన కేంద్రాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ చేశారు. విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులకు విశ్రాంతి గదులు కేటాయించారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయి చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చిన విద్యార్థులకు హాస్టల్స్‌లో వసతి సైతం కల్పించారు.

టెక్కలి డీఎస్పీ కార్యాలయంలో వార్షిక తనిఖీలు



టెక్కలి డీఎస్పీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

టెక్కలి: టెక్కలిలో కొత్తగా ఏర్పాటైన డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ జీఆర్ రాధిక మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయం పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. అనంతరం నేరాల నియంత్రణ కోసం పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఆమెతో పాటు డీఎస్పీ బాలచంద్రారెడ్డి ఉన్నారు.

నాడు సంక్షోభం..
నేడు సంక్షేమం

శ్రీకాకుళంలో పచ్చనేతల పాలనను శిలాఫలకాలు వెక్కిరిస్తుంటే.. వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి పనులు సాక్షాత్కరిస్తున్నాయి. ఐదేళ్ల టీడీపీ పాలనలో దస్సిపోయిన జిల్లా కేంద్రాన్ని ధర్మాన ప్రసాదరావు మళ్లీ ప్రగతి మార్గం పట్టిస్తున్నారు. నాలుగేళ్లుగా ఒక్కొక్కటిగా పనులన్నీ పూర్తి చేస్తూ వస్తున్నారు. పూర్తి కావాల్సిన పనులపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వాస్తవానికి ఇది వరకు కూడా సిక్కోలులో ప్రగతి పనులన్నీ ధర్మాన హయాంలో జరిగినవే. టీడీపీ హయాంలో నాయకులు కాలక్షేపం చేయడం తప్ప పనులేవీ చేయలేదని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు.

- శ్రీకాకుళంలో పచ్చనేతల పాలన శిలాఫలకాలకే పరిమితం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు
- అప్పట్లో హామీలు గాలికొదిలేసిన టీడీపీ నేతలు
- ఇచ్చిన మాట మేరకు పనులు చేస్తున్న మంత్రి ధర్మాన
- జిల్లా కేంద్రంలో నాలుగేళ్లలో మారిన పరిస్థితులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: శ్రీకాకుళం బేరీజు వేసుకుంటోంది. ఐదేళ్ల పాటు టీడీపీ హయాంలో జరిగిన పనులకు, ఆ తర్వాత వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు చేపట్టిన సంక్షేమాన్ని పోల్చుకుని చూస్తోంది. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసి, అభివృద్ధి పనులను పక్కన పెట్టేసి టీడీపీ నాయకులు అవినీతి పనులతో కాలక్షేపం చేయగా.. ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా పనులన్నీ పూర్తి చేస్తూ వస్తూ ధర్మాన ప్రసాదరావు నియోజకవర్గ ప్రజల మనసు గెలుచుకుంటున్నారు. టీడీపీ ఐదేళ్ల కాలంలో రూ.559.77లక్షలు ఖర్చు పెడితే, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.1105.59 లక్షలతో ఒక్క కార్పొరేషన్‌లోనే రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో చేయని పనులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేవలం నాలుగేళ్లలో చేసి చూపించింది. మరో ఏడాదిలో మరింత మార్పు చూపించనుంది.



వైఎస్ జగన్ ప్రభుత్వంలో కొత్తపేటలో వేసిన రోడ్డు



శిలాఫలకానికే పరిమితమైన జూనియర్ కళాశాల భవనం

నాడు 'శిలాఫలకం'తో సరి

గార మండలంలోని ఏకైక ప్రభుత్వ జూనియర్ కాలేజీని బాగు చేస్తామని 2019 జనవరిలో అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శంకుస్థాపన చేశారు. కానీ శిలాఫలకం తప్ప భవనాలు కట్టలేదు.



దాదాపు పూర్తికావచ్చిన జూనియర్ కళాశాల భవనం

నేడు ధర్మాన చొరవతో

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవ తీసుకుని కాంట్రాక్టరును మార్చి పనులు ప్రారంభించారు. రూ.31 లక్షలతో పనులు జరుగుతున్నాయి. ఆగస్టులో ప్రారంభించనున్నారు.



టీడీపీ హయాంలో వేసిన శిలా ఫలకం

శ్రీకాకుళం రూరల్‌లో నర్సింగ్ మెడికల్ కళాశాల హాస్టల్ భవనం నిర్మాణం కోసం టీడీపీ శంకుస్థాపన చేసి వదిలేస్తే.. పూర్తి చేసే బాధ్యతను వైఎస్సార్ సీపీ తీసుకుంది. రూ.12 కోట్లతో పనులు పూర్తి చేస్తోంది. కోడి రామ్మూర్తి స్టేడియం విషయంలోనూ టీడీపీ హామీలకే పరిమితం కాగా.. ఆ పనులు పూర్తి చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేస్తోంది.



టీడీపీ అరకొరగా నిర్మించి వదిలేయడంతో.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో పనులు చేపడుతున్న నర్సింగ్ మెడికల్ కళాశాల

టీడీపీ చేసిన 'ఘన కార్యాలు'

- విశాఖ ఏ కాలనీ, దీపామహల్ వెనక దుర్గాదేవి గుడి గుండా వెళ్లే మార్గంలో మిర్తిబట్టి సగభాగాన్ని ఒక టీడీపీ నాయకుడు ఆక్రమించి, మూడు అంతస్తుల భవనం నిర్మించి, హాస్టల్ నడుపుతున్నారు.
- బలివాడ గ్రామంలో రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని జన్మభూమి కమిటీ సభ్యుడు ఆక్రమించి, అక్రమ నిర్మాణం చేపట్టారు.
- కిల్లిపాలెం పంచాయతీ పరిధిలో గల రామిగెడ్డను టీడీపీ నాయకుడొకరు సగభాగం ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించారు.
- మునసబుపేటలో ల్యాండ్ సీలింగ్ భూములను తారుమారు చేసి ఆక్రమించారు.
- సింగుపురంలో డీ పట్టా భూములను ఆక్రమించారు.
- చాపురంలో టీడీపీ నాయకుడు స్థలంలో లేఅవుట్ వేసుకుని, ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డు వేయించుకున్నాడు.
- పాత్రునివలసలో ల్యాండ్ సీలింగ్ భూముల్లో టీడీపీ నాయకుల అండదండలతో అక్రమంగా లేఅవుట్ వేసి, ప్లాట్ల విక్రయాలు చేసేశారు.
- హుద్‌హుద్, టిడ్కో ఇళ్ల స్కామ్‌ను ఆ పార్టీ నాయకులే బయటపెట్టారు.
- చెత్త నుంచి సంపద కేంద్రాలంటూ నిధులు బొక్కేశారు.
- భూగర్భ డ్రైనేజీ, రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్ సిటీ, కోడి రామమూర్తి స్టేడియం నిర్మాణం, పరిశ్రమల హబ్‌గా శ్రీకాకుళం...ఇలాంటివన్నీ హామీలుగానే మిగిలిపోయాయి.

వైఎస్సార్ సీపీ హయాంలో..

- శ్రీకాకుళం పట్టణంలో రూ.4 కోట్లతో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లకు భవనాలు నిర్మించారు.
- బలగలో ఉన్న మంచినీటి ప్రాజెక్టును 5ఎంఎల్‌డీ అదనపు సామర్థ్యంతో నీరు సరఫరా చేసేందుకు రూ. 2.50కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ. 5.80కోట్లతో 72 రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు.
- అస్తవ్యస్తంగా ఉన్న పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో రూ.2.20కోట్లతో పనులు చేశారు.
- విలీన పంచాయతీల్లో రూ. 3కోట్లతో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టారు.
- టీడీపీ ప్రభుత్వం సగంలో వదిలేసిన టిడ్కో ఇళ్లను సుమారు రూ. 20కోట్లతో నిర్మించారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు, రోడ్లు, వాటర్, డ్రైనేజీ సదుపాయాలు, మురుగునీరు శుద్ధీకరణ కోసం ఖర్చు పెట్టారు.
- డే అండ్ జంక్షన్ వద్ద రూ. కోటి 40లక్షలతో గ్యాస్‌తో రన్ చేసే శ్మశాన వాటిక నిర్మిస్తున్నారు.
- శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వరకు రూ.40కోట్లతో రోడ్డు విస్తరణ చేస్తున్నారు.
- ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పాలిటెక్నిక్ కళాశాల రోడ్డులో 26 షాపులను ఏర్పాటు చేశారు. పొన్నాం నుంచి కళింగపట్నం వరకు నారాయణపురం కుడి కాలువ పనులు చేస్తామని అప్పట్లో గుండ లక్ష్మీదేవి హామీ ఇచ్చారు. కానీ పనులు చేయలేదు. మళ్లీ ఇన్నాళ్లకు మంత్రి ధర్మాన ప్రసాదరావు పనులు పూర్తి చేశారు.

నాడు సంద్రంలో కలిసి హామీ



బీచ్ కోతకు గురైనప్పుడు పరిశీలించి గుండ లక్ష్మీదేవి, ఎంపీ రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చిన సందర్భం

కళింగపట్నం బీచ్ 2108లో వంశధార కోతకు గురై పాడైపోయింది. ఆ సమయంలో పరిశీలించేందుకు ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అప్పటి ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలు పరిశీలించి బీచ్ బాగు చేస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారు.

నేడు రూ.7 కోట్లతో..



బీచ్‌లో ప్రస్తుతం డ్రెడ్జింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

బీచ్ పరిస్థితిని మంత్రి ధర్మాన సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లి రూ.7 కోట్లు మంజూరు చేయించారు. రాతి గ్రోయిన్లు, డ్రెడ్జింగ్ ద్వారా ఇసుకను మళ్లించి కొట్టుకుపోయిన స్థలంలో రెండేళ్లుగా పనులు చేయిస్తున్నారు.

శ్రీకాకుళంలోనే ఎక్కువ పనులు

ప్రణాళికాబద్ధంగా శ్రీకాకుళం కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. బెస్ట్ ప్రాక్టీసుగా తీసుకున్నాం. మంత్రి ధర్మాన ప్రసాదరావు, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ సూచన, సలహాలు, చొరవతో అభివృద్ధి పనులు చేయగలుగుతున్నాం. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత క్రమంలో పనులు చేపడుతున్నాయి. త్వరలోనే రూ.10కోట్లతో నగరంలో బీటీ రోడ్లు నిర్మించనున్నాం.

– ఓబులేసు, కమిషనర్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ

రైతుబజారులో రూ.50కే కిలో టమాటా



ప్రజల సౌకర్యార్థం కిలో టమాటాను రైతు బజార్లలో రూ.50కే అందజేయనున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని రైతుబజారులో మంగళవారం సబ్సిడీపై టమాటా అందించే కేంద్రాన్ని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా కలెక్టర్ కొనుగోలుదారులకు టమాటాలను అందించారు. గత రెండు వారాలుగా దేశ, రాష్ట్రవ్యాప్తంగా టమాటా ధరలు విపరీతంగా పెరిగాయని, ప్రస్తు తం బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.120కు చేరిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్ర భుత్వ ఆదేశాల మేరకు ప్రజల సౌకర్యార్థం మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా మదనపల్లి నుంచి టమాటాలను సేకరించి సబ్సిడీపై రూ.50కే కిలో అందించేందుకు రైతు బజారుల్లో విక్రయ కేంద్రాలు ప్రారంభించామన్నారు. తొలివిడతగా జిల్లా కు 5వేల టన్నుల టమాటాలను దిగుమతి చేసుకున్నామని, వీటిని పట్టణ ప్రజల సౌకర్యార్థం అందు బాటులో ఉంచామన్నారు. ప్రజలందరికీ దొరికేలా ఒక్కొక్కరూ కిలో మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. త్వరలోనే ఆమదాలవలస, పలాస వంటి పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ వివరించారు. - శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)



కొనుగోలుదారులకు టమాటాలను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

వర్షం వేళ జాగ్రత్త సుమా..!



అరసవల్లి: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని ఈపీడీసీఎల్ సర్కిల్ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ విజ్ఞప్తి చేశారు. ఇటీవల పొందూరులో విద్యుత్ తీగ పడి ఒక యువకుడు మృత్యువాత పడగా, లావేరులో ఒక జేఎల్ఎం విద్యుత్ ప్రమాదంలో గాయపడడంతో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో పలు సూచనలు చేశారు. ఆయన తెలిపిన వివరాల మేరకు..



మాట్లాడుతున్న ఎస్ఈ దైవప్రసాద్

- విద్యుత్ సమస్యలకు అలాగే ప్రమాదాల నివారణకు కూడా వెంటనే 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలి. అలాగే స్థానిక విద్యుత్ సర్కిల్ ఆఫీస్ కంట్రోల్ నంబర్ 94906 12633కి డయల్ చేయాలి.
- వర్షాలు కురుస్తున్న వేళ విద్యుత్ స్తంభాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల పరిసరాల్లో ఉండకూడదు.
- తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదు. అలాగే విద్యుత్ స్తంభాలకు ఉన్న స్టే వైర్లను కూడా తాకే ప్రయత్నాలు చేయవద్దు. నీటిలో పడిన విద్యుత్ తీగలను తాకకూడదు.
- విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తాకే ప్రయత్నం గానీ, నరికే ప్రయత్నాలు చేయవద్దు.
- భవన నిర్మాణాలు చేసే వాళ్లు విద్యుత్ స్తంభాలు, వైర్లకు తగినంత దూరంగా ఉండేలా చూసుకోవాలి.
- విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా ఉండాలంటే నాణ్యమైన విద్యుత్ వైర్లను వినియోగించాలి.
- విద్యుత్ వైర్లు వేలాడుతున్న సమాచారాన్ని వెంటనే సమీప విద్యుత్ సిబ్బందికి గానీ 1912కి గానీ చెప్పాలి.
- విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తికి..రక్షించే క్రమంలో నేరుగా చేతులతో తాకరాదు. పొడి కర్ర లేదా విద్యుత్ ప్రవహించని ప్లాస్టిక్ వస్తువుతో షాక్‌కు గురైన వ్యక్తిని తప్పించాలి.
- క్రేన్లు, ఇతర ట్రిప్పర్ల సహాయంతో విద్యుత్ పనులు చేస్తున్నప్పుడు విద్యుత్ వైర్లను పరికరాలను గమనించి పనిచేయాలి.

జోరుగా వానలు



హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద దిగువకు విడిచిపెట్టిన నీరు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నాలుగు రోజులుగా జిల్లాలో జడివాన కురుస్తోంది. జూన్ నెలలో వర్షాలు తక్కువగా ఉన్నా, జూలైలో సగటు కంటే ఎక్కువగా వర్షాలు పడ్డాయి. సుమారుగా అన్ని మండలాల్లో ఈ నెలలో ఇప్పటికి 10 నుంచి 14 రోజుల పాటు వానలు కురిశాయి. సోమవారం జిల్లాలో మొత్తం కలిపి 318 మిల్లీమీటర్ల వర్షం కురవగా, మంగళవారం 1371 మిల్లీమీటర్లు పడింది. జిల్లాలో ఉన్న 30 మండలాల్లో 15 మండలాల్లో సగటు కంటే ఎక్కువగా వర్షం కురవగా, 8 మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది.

ముంపులో తంపర పంట పొలాలు

ఎల్.ఎన్.పేట: గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తంపర పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. దబ్బపాడు, రావిచెంద్రి, తురకపేట, సిద్ధాంతం, చిట్టిమండలం, ధనుకువాడ, కోవిలాం, యంబరాం, స్కాట్‌పేట, మోదుగువలస, మిరియాపల్లి, ముంగెన్నపాడు గ్రామాలకు చెందిన సుమారు 500 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ఎల్.ఎన్.పేట: మోదుగువలస వద్ద నీట మునిగిన పొలాలు

వంశధారకు పెరిగిన వరద

హిరమండలం: హిరమండలం వంశధార గొట్టా బ్యారేజీ వద్ద మంగళవారం ఉదయానికి స్వల్పంగా వరద నీరు పెరిగింది. క్యాచ్‌మెంట్ ఏరియాతో పాటు గత మూడు రోజులుగా పడుతున్న తేలిక పాటి వర్షాలకు వంశధారలో వరదనీరు వచ్చి చేరుతోంది. గొట్టా బ్యారేజీ వద్ద 38.10 మీటర్ల నీటి మట్టం ఉంది. సోమవారం సాయంత్రానికి బ్యారేజీలోకి ఇన్‌ఫ్లో సుమారు 8వేల క్యూసెక్కులు ఉంది. మంగళవారం ఉదయానికి 10,108 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. వచ్చిన నీటిని 12 గేట్లు 20 సెంటీమీటర్లు మేర పైకి ఎత్తి 10,108 క్యూసెక్కులు దిగువకు విడిచిపెట్టినట్లు ఇన్‌చార్జి డీఈ అనిల్‌కుమార్ తెలిపారు. అలాగే కుడి, ఎడమ ప్రధాన కాలువకు నీరు వెళ్లకుండా ఆపినట్లు తెలిపారు.

వర్షం మిల్లీ మీటర్లలో

కొత్తూరు	127.2	రణస్థలం	72.4	పలాస	55.4	హిరమండలం	34.6	మందస	28.2	కవిటి	15.4
ఎచ్చెర్ల	91.8	కోటబొమ్మాళి	70.0	జలుమూరు	48.4	కంచిలి	32.4	వజ్రపుకొత్తూరు	26.2	సోంపేట	15.2
శ్రీకాకుళం	84.2	మెళియాపుట్టి	68.8	గారలో	44.4	ఇచ్ఛాపురం	32.2	పొందూరు	26.2	టెక్కలి	14.0
ఎల్ఎన్‌పేట	83.6	సారవకోట	58.4	సంతబొమ్మాళి	42.4	నరసన్నపేట	30.4	ఆమదాలవలస	23.8	జి.సిగడాం	10.8
లావేరు	78.4	సరుబుజ్జిలి	56.0	పోలాకి	38.8	పాతపట్నం	29.4	బూర్జ	23.4	నందిగాం	9.0

మహేంద్ర తనయ ఉరకలు

మూడురోజులుగా వర్షాలు కురుస్తుండడంతో మహేంద్ర తనయ ఉరకలు పెడుతోంది. పాతపట్నం నీలకంఠేశ్వరం ఆలయం వద్ద ఉన్న కాజ్‌వేపై నుంచి మంగళవారం ఉదయం నీరు పారింది. కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. -పాతపట్నం



క్లుప్తంగా

అక్రమ రొయ్యల చెరువులపై దాడులు



రొయ్యల చెరువుల గట్లను తొలగిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: నాగావళి నదీ పరివాహక ప్రాంతాల్లో మోపసు బందరు రెవెన్యూ పరిధిలో జాలారిపేట వద్ద అక్రమంగా నిర్వహిస్తున్న రొయ్యల చెరువుల చెరువులపై జిల్లా రెవెన్యూ అధికారులు, పోలీసులు కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశాల ప్రకారం ఈ దాడులు చేస్తున్నట్లు తహశీల్దార్ ఎస్.వెంకట్రావు తెలిపారు. సుమారు 57 ఎకరాల్లో ఉన్న అనధికార చేపల చెరువుల ట్యాంకులను పొక్లెయినర్ల సాయంతో తొలగించారు. కాగా, బంగాళాఖాతంలో నాగావళి కలిసే ప్రాంతంలో అక్రమంగా చెరువులు తవ్వకంవల్ల గ్రామాల్లోకి వరద నీరు వచ్చి ఇబ్బందులు పడుతన్నామని స్థానికులు సామాజిక కార్యకర్తల సహాయంతో కోర్టులో పలు పిటిషన్లు దాఖలు చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేసిన న్యాయస్థానం వెంటనే ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేస్తూ అస్ సర్వే ల్యాండ్‌లో నిర్మించిన రొయ్యల చెరువులను తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు టౌన్ సీఐ సన్యాసినాయుడు, రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ సమక్షంలో సుమారు 60 మంది పోలీసు బందోబస్తుతో అక్రమ చెరువుల గట్లను తొలగించారు.

వలంటీర్ సేవాగుణం



నాడు వృథాగా



పైప్, ట్యాప్‌తో కుళాయి

పలాస: పలాస మండలం బొడ్డపాడు కాలనీ వద్ద ఉద్దానం మంచినీటి ప్రాజెక్టుకు సంబంధించిన కుళాయి పాడవడంతో తాగునీరు వృథాగా పోయేది. కొంతకాలంగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో స్థానిక గ్రామ వలంటీర్ పత్తిరి విజయ్ ముందుకొచ్చాడు. కొత్త పైపుతో పాటు ట్యాప్ ఏర్పాటు చేయడంతో సమస్య పరిష్కారమైంది. వలంటీర్ సేవాగుణాన్ని స్థానికులు అభినందించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,000-00
బంగారం(22సి. 10గ్రా.)	55,000-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220



కొండల మాటున చొరబడి భారత భూభాగాన్ని కబళించేందుకు శత్రువు పన్నాగం. వారిని సరిహద్దు అవలకు తరిమికొట్టే బాధ్యత స్వీకరించింది సైన్యం. చుట్టుపక్కల ఉన్న వివిధ రెజిమెంట్ల బలగాలను ఉన్నఫళంగా లక్ష్యం వైపు కదలమని పైనుంచి ఆదేశాలు. ప్రతికూల వాతావరణం, కొండల పైనుంచి గుళ్ల వర్షం కురిపిస్తూ శత్రుమూకల ప్రతిఘటన. అయినా మన జవాన్లు వెరవలేదు.. వెనుకంజ వేయలేదు. కాలినడకన అతి బరువైన ఆయుధాలను మోసుకుంటూ కొందరు.. వాహనాల్లో మరికొందరు రోజుల తరబడి ప్రయాణం చేసి యుద్ధభూమిని చేరుకున్నారు. పైనుంచి కురుస్తున్న గుళ్ల వర్షం నుంచి తమను తాము కాపాడుకుంటూనే బృందాలుగా విడిపోయి హిమాచలాలను అధిరోహించి, శత్రు మూకల పీచమణిచి, టైగర్ హిల్స్ అని పిలిచే కార్గిల్ కొండలపై విజయ పతాకం ఎగురవేశారు. దానికి గుర్తుగానే ఏటా జూలై 26న కార్గిల్ దివస్ జరుపుకుంటున్నాం. భారతీయుల గుండెలు గర్వంతో ఉప్పొంగేలా చేసిన కార్గిల్ యుద్ధంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరు జవాన్లు భాగస్వాములయ్యారు. నేడు కార్గిల్ దినోత్సవం సందర్భంగా ఆ యుద్ధవీరుల గుండె చప్పుడు విందాం.

– శ్రీకాకుళం డెస్క్

కార్గిల్ వీరుల కర్తవ్య దీక్ష అచంచలం

పేరు:	చిన్ని సింహాచలం
స్వస్థలం:	లక్కుపురం, బూర్జ మండలం
సైన్యంలో హోదా:	హవల్దార్



- గుళ్ల వర్షం దాటుకుని.. పర్వతాన్ని స్వాధీనం చేసుకుని..

మే 25.. 1999..
1889 లైట్ రెజిమెంట్

శ్రీనగర్ సమీపంలో డ్యూటీలో ఉన్నా. హయ్యర్ కమాండ్ నుంచి సమాచారం వచ్చింది. మరుసటి రోజు ఉదయాన్నే కార్గిల్ వైపు బయల్దేరాలని మూవ్ అయ్యాం. అంతా నడకే. శత్రుమూకలు కొండపైనుంచి గుళ్ల వర్షం కురిపిస్తూనే ఉన్నాయి. మే 31 నాటికి ప్రతికూల పరిస్థితుల్లో టోలోలింగ్ పర్వత ప్రాంతానికి చేరుకున్నాం. వేసవి కాలం అయినా విపరీతమైన చలి.. 421 కేజీల బరువైన 120 ఎంఎం మోర్టార్ గన్‌ను ఐదుగురు సభ్యులం చొప్పున మోసుకుంటూ.. ఫైరింగ్ చేస్తూ ముందుకుసాగాం. 72 గంటలు ఫైరింగ్ ఆపలేదు. గుళ్ల వర్షం కురుస్తూనే ఉంది. బాంబుల మోతతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లుతోంది. సుబేదార్ బన్వర్‌సింగ్ వీరమరణం పొందారు. హవల్దార్ బాబుల్ మిలీ, లాన్స్ నాయక్ వీరయ్య తీవ్రంగా గాయపడ్డారు. దేశరక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతూనే ఉన్నాం. జూన్ 12 మొదటి విజయం. ద్రాస్ సెక్టార్‌లోని టోలోలింగ్ పర్వత ప్రాంతం భారత సైన్యం అధీనంలోకి వచ్చింది. ఈ విజయోత్సాహంతో ముందుకు కదిలేందుకు సిద్ధమవుతున్నాం. అదే రోజు రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఉన్నట్టుండి పెద్ద కుదుపు. కుడిచేతికి తీవ్రగాయాలు.. విపరీతమైన రక్తస్రావం. నా పరిస్థితి గమనించిన ఉన్నతాధికారులు అదే రోజు రాత్రి చికిత్స కోసం హెలికాప్టర్‌లో ఆర్మీ బేస్ ఆస్పత్రికి తరలించారు. ఉదయం శస్త్రచికిత్స జరిగింది. మూడురోజుల తరువాత విమానంలో చండీగఢ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ 12 రోజులు.. అనంతరం విశాఖ ఐఎన్ఎస్‌హెచ్ఎస్ కల్యాణికి.. అక్కడ వారం రోజుల చికిత్స జూలై 5న స్వగ్రామానికి వచ్చాను. కొద్ది రోజుల విశ్రాంతి అనంతరం విధుల్లో చేరాను. 1999 ఆగస్టులో కార్గిల్ పోస్టింగ్ ఇచ్చారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో విధి నిర్వహణ అనంతరం మళ్లీ ఆగస్టు 2010 నుంచి నవంబర్ 2011 వరకు కార్గిల్‌లో సేవలందించాను. ఓపీ స్టార్, ఓపీ విజయ్, ఓపీ రక్షక్, వుండ్ మెడల్స్‌ను ప్రభుత్వం నాకు అందించింది. 2014లో సైన్యం నుంచి హవల్దార్‌గా రిటైర్ అయ్యాను.

'దేశరక్షణ విధులకు యువత మొగ్గు చూపాలి. అందులో ఉండే తృప్తి ఇంకా ఎందులోనూ లభించదు.'

- ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్న ఇద్దరు సిక్కోలు సైనికులు
- ఒకరు సింహాచలం.. మరొకరు నీలాచలం
- నేడు కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా యుద్ధవీరుల గుండెచప్పుడు



ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్నందుకు సైనికులకు అందజేసిన మెడల్స్





వార్ హీరోస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బుక్‌లెట్‌లో సైనికుల ప్రస్తావన

పేరు:	టొంప నీలాచలం
స్వగ్రామం:	కేసిపురం, పలాస మండలం
సైన్యంలో హోదా:	హవల్దార్



- కదలికల్ని గమనించి.. గుళ్ల వర్షం కురిపించినా..

మే 15.. 1999
28 రాష్ట్రీయ రైఫిల్స్ (జమ్మూ,కాశ్మీర్)

బారాముల్లా ప్రాంతంలో విధుల్లో ఉన్నాను. రాత్రి 12 గంటల సమయంలో మెసేజ్ వచ్చింది. 38 గంటల్లో కార్గిల్ వైపు మూవ్ అవ్వాలని దాని సారాంశం. మే 16 ఉదయం బయల్దేరాం. వాహనాల్లో మా ప్రయాణం. నాలుగు రోజుల సమయం పట్టింది. భారీ ఆయుధ సామగ్రితో ముందుకు కదిలాం. ద్రాస్ సెక్టార్‌కు చేరుకున్నాం. 20 మంది చొప్పున బృందాలుగా పర్వతం పైకి ప్రయాణం. ఏకే 47, లైట్‌మెషిన్ గన్, ఎంఎంజీ, మోర్టార్స్ మా ఆయుధాలు. వారం రోజుల అనంతరం కీలక ప్రాంతమైన టైగర్ హిల్స్‌కు చేరుకున్నాం. ఈ క్రమంలో ఓ అర్ధరాత్రి వేళ మా కదలికలను గమనించిన శత్రుసైన్యం దాడి చేసింది. కుడి చేతికి గుళ్లు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్పృహ కోల్పోయాను. చాలా సేపటి తరువాత కేకలు వేయడంతో.. ప్రథమ చికిత్స అనంతరం హెలికాప్టర్‌లో శ్రీనగర్ బేస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం రోజులు తరువాత.. అక్కడ రద్దీ పెరగడంతో ఢిల్లీలోని ఆర్ఆర్ ఆస్పత్రికి.. అక్కడ్నుంచి విశాఖలో ఉన్న ఐఎన్‌హెచ్ఎస్ కల్యాణికి తరలించారు. అనంతరం ప్లాస్టిక్ సర్జరీ కోసం ముంబై ఐఎన్‌హెచ్ అశ్వినికి తరలించారు. 20 రోజుల చికిత్స అనంతరం స్వగ్రామానికి చేరుకున్నాను. 28 రోజుల సిక్ అనంతరం మళ్లీ విధులకు సిద్ధమయ్యాను. ఈ పోరులో రాష్ట్రీయ రైఫిల్ విభాగానికి చెందిన 20 మంది వీరమరణం పొందారు. ఆపరేషన్ విజయ్‌లో ఓపీ స్టార్, ఓపీ విజయ్, ఓపీ రక్షక్, వుండ్ మెడల్స్‌ను ప్రభుత్వం నాకు అందించింది. 2015 జూలైలో సైన్యం నుంచి హవల్దార్‌గా రిటైర్ అయ్యాను.

'నేటి యువతకు దేశరక్షణ విధులు ఎంత అవసరమో అవగాహన కల్పిస్తున్నా. ఔత్సాహికులకు శిక్షణ కూడా ఇస్తున్నా.'



యుద్ధ వీరుల గౌరవార్థం..



1999 కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై విజయం సాధించిన తరువాత కార్గిల్ యుద్ధ వీరుల గౌరవార్థం ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. యువతకు మన రక్షణ విభాగాల ఆవశ్యకతను తెలియజేయాలి. వారిని త్రివిధ దళాలలో సేవలందించేందుకు సిద్ధమయ్యేలా ప్రోత్సహించాలి.

– పూర్ణ చంద్రరావు కటకం, ప్రెసిడెంట్, శ్రీకాకుళం జిల్లా మాజీ సైనికుల సమాఖ్య.

చేనేత పరిశ్రమకు చేయూత

- మినీ క్లస్టర్ యూనిట్ల పంపిణీలో స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: చేనేత పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలస మండలం అక్కులపేటలో చేనేత కార్మికులకు రూ.73 లక్షలు విలువైన మినీ క్లస్టర్ యూనిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ చేనేత వస్త్రాలకు ఆదరణ శాశ్వతంగా ఉంటుందన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రతి చేనేత కుటుంబానికి ఏడాదికి రూ. 24 వేలు ఆర్థికసాయం అందజేస్తుందని చెప్పారు. చేనేత కుటుంబాల్లో 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. మగ్గాలు, ఆధునిక పరికరాలు అందజేయడం ద్వారా మరింత అభివృద్ధి చెందేందుకు అవకాశం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామ్మూర్తి, డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, మాజీ ఎంపీటీసీ గురుగుబెల్లి ప్రభాకరరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, సర్పంచ్ బొడ్డేపల్లి గౌరీపతి, పార్టీ నాయకులు కూటికుప్పల సన్యాసిరావు, దన్నాన సత్యనారాయణ, సీతారామ చేనేత సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.



చేనేత కార్మికులకు మినీ క్లస్టర్ యూనిట్లను పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అపోలోలో వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స

ఆరిలోవ: హెల్త్‌సిటీలోని అపోలో ఆస్పత్రి వైద్యులు ఓ వృద్ధుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కార్డియాలజీ విభాగ వైద్య నిపుణులు డాక్టర్ ప్రాణిగ్రహి, డాక్టర్ రవికాంత్, డాక్టర్ జయదీప్ ఆస్పత్రిలో మంగళవారం విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. శ్రీకాకుళానికి చెందిన 78 ఏళ్ల భానూజీరావుకు 2015లో వేరే ఆస్పత్రిలో ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. అప్పట్లో ఆయనకు గుండెలో ఎడమ కవాటం మూసుకుపోవడంతో దాన్ని మార్పిడి చేశారు. కొంతకాలం తర్వాత మళ్లీ ఎడమ కవాటం మూసుకుపోయింది. దీంతో అతని కుటుంబ సభ్యులు ఇటీవల అపోలో ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షలు చేసిన వైద్యులు .. ఆయన వయసు ఎక్కువ కావడంతో రెండోసారి అతనికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయడం ప్రమాదకరమని నిర్ణయానికొచ్చారు. ఈ విషయాన్ని రోగి బంధువులకు వివరించి.. ట్రాన్స్‌కాథెటర్ మిట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ప్రక్రియ ద్వారా చికిత్స చేసేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కుడి కాలు తొడకు రంధ్రం చేసి.. దాని ద్వారా గుండె కుడి కవాటం నుంచి ఎడమ కవాటానికి రంధ్రం చేసినట్లు వైద్యులు వెల్లడించారు. అనంతరం అక్కడ 27.5 మిల్లీమీటర్ల మందం కలిగిన కవాటం మార్పిడి చేసినట్లు తెలిపారు. ఇది అరుదైన శస్త్ర చికిత్స అని.. ప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్న వృద్ధుడికి ఈ విధానం ద్వారా శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేశామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన గుండె బాగా పని చేస్తోందన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

ఆవును రక్షించిన సంచార పశువైద్య వాహనం

వజ్రపుకొత్తూరు: మూగజీవుల వైద్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న సంచార పశు వైద్య వాహనం ఓ ఆవుకు పునర్జన్మనిచ్చింది. వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామంలో హనుమంతు పూర్ణకు చెందిన ఆవు మంగళవారం విద్యుత్ స్తంభం కోసం తీసిన గుంతలో పడింది. స్థానికులు బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో అటుగా వెళ్తున్న అంబులెన్స్ సిబ్బంది గమనించి ఆవుకు అత్యవసర చికిత్స అందించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



ప్రాణాలతో బయటపడిన ఆవు

పడవ బోల్తాపడి మత్స్యకారుడు మృతి

సోంపేట: మండలంలోని ఇస్కలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గంట జనార్ధన (47) సముద్రంలో పడవ బోల్తా పడటంతో మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంట జనార్ధన, బైపల్లి తులసయ్య, బైపల్లి కామారాజు, బైపల్లి రామారావు, బైపల్లి కూర్మారావు మంగళవారం వేకువజామున సముద్రంలో వేటకు వెళ్లారు. కొద్దిసేపటికే పడవ బోల్తా పడటంతో ఐదుగురూ సముద్రంలో పడిపోయారు. జనార్ధనకు బలమైన గాయాలు కావడంతో సముద్రంలోనే మృతి చెందాడు. బైపల్లి తులసయ్య గల్లంతయ్యాడు. స్వల్పంగా గాయపడిన కామరాజు, రామారావు, కూర్మారావులు అదే పడవలో తీరానికి చేరుకున్నారు. సముద్రంలో తేలుతున్న జనార్ధన మృతదేహాన్ని కూడా బయటకు తీసుకువచ్చారు. జనార్ధనకు భార్య నూకమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నూకమ్మ ఫిర్యాదు మేరకు బారువ ఎస్ఐ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోంపేట సామాజిక ఆసుపత్రిలో శవ పంచనామా నిర్వహించారు. కాగా, గల్లంతైన తులసయ్య వేరే బోటు సహాయంతో తీరానికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.



గంట జనార్ధన (ఫైల్)



గ్రామస్తులతో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ

కుటుంబాన్ని ఆదుకుంటాం..

విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ ఇస్కలపాలెం చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందజేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, బైపల్లి రామారావు, బైపల్లి తిరుపతి, ఈశ్వర రావు తదితరులు ఉన్నారు.